సాక్షి
ఒడిశా

బుధవారం । 2 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
నగదు రూ.3,54,580
బంగారం 1 గ్రాము 620 మిల్లీ గ్రాములు
వెండి 30 గ్రాముల 700 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



5 గ్రామాలకు వరద ముంపు
- 8లో



ర్యాగింగ్ చట్టరీత్యా నేరం
- 8లో

న్యూస్‌రీల్

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయండి



కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రమేష్ చంద్ర మఝి

కొరాపుట్: ఉమ్మర్ కోట్ పట్టణంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మఝి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను అతని కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్ కోట్ ప్రాంతం చాలా వెనుకబడి ఉందన్నారు. ఆ ప్రాంతంలో మరింత విద్యా వికాసం జరగాలంటే కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు అవసరమని పేర్కొన్నారు.

ప్రభుత్వ సాయం అందజేత



చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే రఘురాం పొడాల్

కొరాపుట్: రథయాత్రలో మృతి చెందిన యువకుడి కుటుంబానికి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే రఘురాం పొడాల్ రూ.3 లక్షల ప్రభుత్వ సాయం చెక్ మంగళవారం అందజేశారు. రథయాత్రలో భాగంలో కొలాబ్ నగర్‌లో బహుడా రోజున రథం మీద ఉన్న బబులా నాయక్ అనే యువకుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబానికి సీఎం ప్రకటించిన పరిహారం అందజేశారు. కార్యక్రమంలో ఏడీఎంఏ రాజేంద్ర మఝి తదితరులు పాల్గొన్నారు.

12 అడుగుల కొండచిలువ పట్టివేత



పట్టుబడిన కొండ చిలువ

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న ఎంవీ 2 గ్రామం వద్ద ఒక ఇంటిలో మంగళవారం 12 అడుగుల కొండచిలువ కనిపించింది. రాజేష్ హాంస్థా అనే వ్యక్తి తన ఇంటి పెరట్లో చెత్తకుండి వద్ద పెద్ద కొండ చిలువ ఉండడాన్ని గమనించాడు. వెంటనే భయంతో కేకలు వేయగా చుట్టుపక్కల ప్రజలు వచ్చారు. అనంతరం స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యుడు స్నేహాశిష్ నాయిక్ వచ్చి కొండ చిలువను పట్టుకున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు అడవి నుంచి వచ్చి ఉంటుందని పేర్కొన్నారు. అటవీ శాఖ సాయంతో అడవిలో విడిచిపెడతామని స్నేహాశిష్ తెలిపారు.

20 కేజీల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి సోరిషమాల గ్రామం వద్ద మంగళవారం ఉదయం మల్కన్‌గిరి ఎస్ఐ ఎస్.బోయి, సిబ్బంది లక్ష్మణ్ మారిండ, చిరంజీవి స్వయిలు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు ఒక బస్తాను తలపై పెట్టుకొని రావడం గమనించారు. దీంతో వారిని ఆపి బస్తాను తనిఖీ చేయగా అందులో గంజాయిని గుర్తించి, వెంటనే ఇద్దరినీ అరెస్టు చేసి మలకన్‌గిరి పోలీసుస్టేషన్‌కు తరలించారు. వీరిని విచారించగా ఇద్దరూ సోరిషమాల గ్రామానికి చెందిన రాజేంద్ర మాతం, గోవిందలుగా నిర్ధారించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని ఐఐసీ రీగాన్‌కీండో వెల్లడించారు.

+2 సైన్స్ సిలబస్‌లో మార్పు

- సీహెచ్ఎస్ఈ ప్రకటన



ఉన్నత మాధ్యమిక విద్యా మండలి కార్యాలయం

భువనేశ్వర్: +2 సైన్స్ సిలబస్ మార్పుతో కొత్త పరీక్ష ప్రణాళిక ప్రవేశ పెడుతున్నట్లు ఉన్నత మాధ్యమిక విద్యా మండలి (సీహెచ్ఎస్ఈ) ప్రకటించింది. దీనిలో భాగంగా పాత సిలబస్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, గణితం మరియు బయాలజీలోని కొన్ని అధ్యాయాలు తొలగించారు. వచ్చే ఏడాదిలో జరగనున్న +2 సైన్స్ వార్షిక పరీక్ష కొత్త సిలబస్ ప్రకారం నిర్వహిస్తారు. సీబీఎస్ఈ ద్వారా తొలగించబడిన అధ్యాయాల ఆధారంగా ఉన్నత మాధ్యమిక విద్యా మండలి (సీహెచ్ఎస్ఈ) కొత్త సిలబస్‌కు ఆమోదం తెలిపింది.

కొత్త పరీక్ష ప్రణాళిక

ఏటా నిర్వహిస్తున్న 3 త్రైమాసిక పరీక్షలకు బదులుగా, 2 అంతర్గత (ఇంటర్నల్) పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం కౌన్సిల్ పరీక్షలో 80% మరియు అంతర్గత పరీక్షలో 20% మార్కుల ఆధారంగా సమగ్రంగా మార్కులు కేటాయిస్తారు. ఈ మేరకు ఉన్నత మాధ్యమిక విద్యా మండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్ట్స్, కామర్స్, వృత్తి విద్యా కోర్సు విభాగంలో మాత్రం సిలబస్ మారలేదు. సవరించిన సిలబస్ వివరాలు సీహెచ్ఎస్ఈ అధికారిక వెబ్‌సైట్ www.chseodisha.nic.in లో అందుబాటులో ఉంచారు. 2024 వార్షిక హయ్యర్ సెకండరీ పరీక్షకు హాజరయ్యే 11వ తరగతి విద్యార్థుల కోసం ఒడిశా స్టేట్ బ్యూరో ఆఫ్ టెక్స్ట్‌బుక్స్ ప్రిపరేషన్ అండ్ ప్రొడక్షన్ ప్రచురించిన పాఠ్యపుస్తకాలతో పాటు న్యూఢిల్లీలోని ఎన్‌సీఈఆర్‌టీ ప్రచురించిన ఫిజిక్స్, కెమిస్ట్రీ మరియు బయాలజీ పుస్తకాలు సిఫార్సు చేయబడ్డాయి. వార్షిక హయ్యర్ సెకండరీ పరీక్షలు-2024 రాసే విద్యార్థుల కోసం గణితం పుస్తకాలు ఒడిషా స్టేట్ బ్యూరో ఆఫ్ టెక్స్ట్ బుక్స్ ప్రిపరేషన్ మరియు ప్రొడక్షన్ ప్రచురించిన పాఠ్యపుస్తకాలు సిఫార్సు చేయబడ్డాయి.

మోదీ సర్కారుకు అండగా బీజేడీ

- విపక్షాల అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకం
- ఢిల్లీ సర్వీసెస్ ఆర్డినెన్స్ స్థానంలో బిల్లుకు మద్దతు

భువనేశ్వర్: కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారుకు బిజూ జనతా దళ్ అండగా నిలుస్తోంది. ఉభయ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ నుంచి సమాన దూరం పాటిస్తున్నట్లు ప్రకటిస్తూ తరచూ మోదీ సర్కారుకు విపత్తులో బీజేడీ అండగా నిలవడం జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. కేంద్ర ప్రభుత్వంపై వివిధ ప్రతిపక్ష పార్టీలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు బిజూ జనతా దళ్ మంగళవారం ప్రకటించింది. అలాగే ఢిల్లీ సర్వీసెస్ ఆర్డినెన్స్ భర్తీ చేసే బిల్లుకు మద్దతు ఇస్తున్నామని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు సస్మిత్ పాత్రో మంగళవారం తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నేతృత్వంలో బీజేడీ నిర్ణయం, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు సొంతంగా పూర్తి మెజారిటీ లేని రాజ్యసభలో గెలుపు కోసం సహాయం అవుతుంది. బిజూ జనతాదళ్ (బీజేడీ)కి రాజ్యసభలో తొమ్మిది మంది ఎంపీల బలం ఉంది.

2019 నుంచి మద్దతు

బీజేపీ మరియు కాంగ్రెస్ రెండింటికీ సమాన దూరాన్ని కొనసాగిస్తున్నట్లు అధికారికంగా చెప్పుకుంటూనే, రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీగా చలామణి అవుతున్న బిజూ జనతా దళ్ 2019 సంవత్సరం నుంచి దాదాపు అన్ని అంశాల్లో కేంద్రంలోని నరేంద్ర మోదీ పాలనకు మద్దతు ఇస్తోంది. జమ్మూ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు-2019 (పునర్వ్యవస్థీకరణ)కు బీజేడీ మద్దతునిచ్చింది. యూఏపీఏ మరియు సమాచార హక్కు చట్టాల్లో మార్పులు ప్రతిపాదించడం మరియు ట్రిపుల్ తలాక్‌ను నేరంగా పరిగణించే బిల్లులకు నవీన్ పట్నాయక్ నిర్ణయం మేరకు బిజూ జనతా దళ్ కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారును విజయవంతంగా గట్టెక్కించింది. అంతేకాకుండా ప్రధానమంత్రి మరియు హోంమంత్రి అభ్యర్థన మేరకు అశ్విని వైష్ణవ్‌కు బీజేడీ రాజ్యసభకు నామినేట్ చేసి రాజకీయ సమీకరణాల్లో సరికొత్త విధానానికి తెరలేపింది.

కాంగ్రెస్ మండిపాటు

విపక్షాల సమూహం ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి బిజూ జనతా దళ్ వ్యతిరేకత ప్రకటించడంపై రాష్ట్ర కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. ఈ నిర్ణయంతో మహిళలపై బిజూ జనతాదళ్ (బీజేడీ) గౌరవం ఏమిటో బహిర్గతమైందని రాష్ట్ర కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ బిజయ్ కుమార్ పట్నాయక్ వ్యాఖ్యానించారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి బీజేడీ లొంగిపోయిందని ఆరోపించారు. మణిపూర్‌లో గత మూడు నెలలుగా మహిళలపై క్రూరమైన దాడులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, పెద్ద ఎత్తున హింసాత్మక ఘటనలపై ప్రతిపక్ష పార్టీలు నరేంద్ర మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయన్నారు. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగిస్తున్నట్లు చూపించిన వీడియో ప్రపంచ ఆగ్రహానికి మరియు ఖండనకు దారితీసింది. ఈ సమస్యపై వివిధ ప్రతిపక్ష పార్టీలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకించాలనే నిర్ణయంతో బీజేడీ మహిళ గౌరవానికి కళంకం తెచ్చిందన్నారు.

తొలగిన ప్రతిష్టంభన

- 9వ తేదీన జగన్నాథుని బొనొకొ లగ్గి



భువనేశ్వర్: శ్రీజగన్నాథుని బొనొకొ లగ్గి వివాదంపై ప్రతిష్టంభన తొలగింది. ఆలయ నిర్వహణ, దత్త మహాపాత్ర వర్గం సేవకుల మధ్య వివాదానికి తెర పడింది. ఈనెల 9వ తేదీన మూల విరాటులకు బొనొకొ లగ్గి సేవ నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ విషయాన్ని శ్రీమందిరం పాలక వర్గం మంగళవారం ప్రకటించింది. సుమారు నెల రోజుల పైబడి దత్త మహాపాత్రొ, పాలక మండలి మధ్య వివాదంతో శ్రీముఖ సింగారం బొనొకొ లగ్గి సేవ స్తంభించి పోయింది. స్వామి వార్షిక రథయాత్ర అంతిమ ఘట్టం నీలాద్రి విజే నుంచి మూల విరాటులు అలంకరణ లేకుండా గడుపుతున్నారు. శ్రీ మందిరం పాలక మండలి బుధవారం, దత్త మహాపాత్రొ వర్గం గురువారం బొనొకొ లగ్గి సేవ నిర్వహించాలని పట్టుబట్టిన విషయం తెలిసిందే. ఈ వివాదం పరిష్కారానికి మంగళవారం ప్రతిపాదించిన పాలక మండలి సమావేశం చివరి క్షణంలో వాయిదా పడింది. అయినా బొనొకొ లగ్గి సేవ ఈనెల 9వ తేదీ బుధవారం నిర్వహించేందుకు ఇరువర్గాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. ఈ నిర్ణయం వాస్తవ కార్యాచరణపై సర్వత్రా సందిగ్ధత నెలకొని ఉంది.

ఆదివాసీలుగా గుర్తించాలని వినతి



కేంద్రమంత్రి టుడుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయగడ: జొడియా సాంప్రదాయం కలిగిన వారిని ఆదివాసీలుగా గుర్తించాలని కేంద్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి విశ్వేశ్వర టుడుకు కాసీపూర్‌కు చెందిన జొడియా సాంప్రదాయ ప్రజలు వినతిపత్రం అందజేశారు. బీజేపీ ఎస్సీ, ఎస్టీ మోర్చా రాష్ట్ర శాఖ సాధారణ కార్యదర్శి కాశీరాం మాఝి నేతృత్వంలో కాసీపూర్‌కు చెందిన సమాజ సేవకురాలు సుమని జొడియాతో పాటు మరికొంతమంది మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిశారు. దీర్ఘకాలంగా సమస్య తమను వేధిస్తోందని, ఆదివాసీలుగా గుర్తించగలిగితే ప్రభుత్వ పథకాలు తమకు అందుతాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా ఈ సమస్యపై తాము పోరాడుతున్నా ఫలితం లేకపోయిందని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

సోమనాథ్ ఖిలాడి మృతి



సోమనాథ్ ఖిలాడి (ఫైల్)

జయపురం: కొరాపుట్ జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే తబలా, డోలక్ సంగీత కళాకారునిగా గుర్తింపు పొందిన సంగీత విద్వాంసులు సోమనాథ్ ఖిలాడి జయపురంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆయన 1962లో జన్మించారు. 1995లో జయపురం ఆకాశవాణి కేంద్రంలో తబలా ఆర్టిస్టుగా గుర్తింపు పొందారు. రాష్ట్రంలో ప్రథమ డోలక్ వాయిద్యకారునిగా అతడిని పేర్కొంటారు. జయపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ రిటైరైన ఆయన వాయిద్య సంగీతమే ప్రాణంగా భావించి, తన సంగీత ప్రయాణం త్రిమూర్తి ఆర్కెస్ట్రా గ్రూపుతో ప్రారంభించి దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందారు. ఒడిశాలో దివంగత సంగీత కళాకారుడు ప్రశాంత సామంతరాయ్ పాటలన్నింటికీ సంగీత రూపకల్పన బాధ్యతలు నిర్వహించారు. ఆయన మృతికి మాజీ మంత్రి రబినారాయణ నందో, జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, సంగీత కళాకారులు ధిరెన్ మోహన్ పట్నాయిక్, సుకాంత అధికారి, నిహార్ మహంతి, రామ్ నాయిక్, ధన్‌రాజ్ సంతాపం తెలిపారు.

గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఫొటో

బరంపురం: నగరానికి సమీపంలో మట్టి కింద గుర్తు తెలియని యువతి మృతదేహాన్ని హిజిలికాట్ పోలీసులు గుర్తించారు. ఐఐసీ అధికారి అభిమన్య దాస్ తెలిపిన వివరాల మేరకు.. గంజాం జిల్లా హిజిలికాట్ పోలీసుస్టేషన్ పరిధి కుకుడాఖండి బ్లాక్ పరిధిలోని మౌలపల్లి గ్రామం దగ్గర పొలంలో మట్టి కింద యువతి శరీరం కనబడడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే హింజిలి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో అస్కా మెజిస్ట్రేట్ సమక్షంలో యువతి మృతదేహాన్ని బయటికి తీశారు. యువతి మెడలో బంగారం గొలుసు, హ్యాండ్ బ్యాగ్‌లో ఫొటోని స్వాధీనం చేసుకున్నారు. గుర్తు తెలియని దుండగులు హత్య చేసిన అనంతరం మట్టిలో పూడ్చిపెట్టినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని బరంపురం ఎంకేసీజీ మెడికల్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్కింగ్ స్థలం కేటాయించాలి



ఆర్పీఎఫ్ వర్గాలతో ఉభయ కార్మిక సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: ఖుర్దారోడ్ రైల్వేస్టేషన్ పరిసరాల్లో విధులకు హాజరయ్యే సిబ్బంది వాహనాలు నిలిపేందుకు అనుకూలమైన చోటు లేదు. రైల్వేస్టేషన్ పాత భవనం ఆవరణలో గత కొన్ని నెలలుగా వాహనాలను నిలుపుతున్నారు. అయితే ఇక్కడ రైల్వే రక్షక దళం మినహా ఇతర విభాగాల సిబ్బంది వాహనాలు నిలిపేందుకు అనుమతి నిరాకరించడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో స్టేషన్ మేనేజరు కార్యాలయంలో సిబ్బంది సంక్షేమానికి ప్రాతినిథ్యం వహించే ఉభయ కార్మిక సంఘాల ప్రతినిధులతో రైల్వే రక్షక దళం ఆర్పీఎఫ్ అధికార ప్రతినిధుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఖుర్దారోడ్ డీఆర్ఎంతో కార్మిక సంఘాల ప్రతినిధులు భేటీ అయ్యి సిబ్బంది కోసం ప్రత్యేక పార్కింగ్ జోన్ ఏర్పాటు కోసం అభ్యర్థించేందుకు నిర్ణయించారు. ఆయన అనుమతితో కొత్త పార్కింగ్ జోన్ నిర్మాణం పూర్తయ్యే వరకు యథాతథంగా రైల్వే స్టేషన్ పాత ప్రవేశ మార్గం ఆవరణంలో అధికారిక గుర్తింపు కార్డు దాఖలు చేసి వాహనాలు నిలిపేందుకు తాత్కాలికంగా తీర్మానించారు.

పరారీలో ఉన్న నిందితుడు అరెస్టు



పట్టుబడిన అర్జున్ హరిజన్

జయపురం: ఒక గోడౌన్‌లో ట్రాక్టర్ల దొంగతనం కేసులో పరారీలో ఉన్న నిందితుడిని ఆదివారం అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసుస్టేషన్ అధికారి ఈశ్వర తండి మంగళవారం తెలియజేశారు. పట్టుబడిన నిందితుడు అర్జున హరిజన్‌గా పేర్కొన్నారు. అతను ఆ గోడౌన్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ ఉండేవాడని వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే... జయపురంలో కృష్ణచంద్ర మహరాణ ఒక ట్రాక్టర్ షోరూం నడుపుతూ ఉండేవాడని, అతడికి టంకువ గ్రామంలో గొడౌన్ ఉండగా ఉపేంద్ర గౌధ, అర్జున హరిజన్‌లను వాచ్‌మెన్‌లుగా నియమించారని వెల్లడించారు. ఆ ట్రాక్టర్ గోదాములో 2020 ఫిబ్రవరి 26వ తేదీన రెండు ట్రాక్టర్లు దొంగిలించబడ్డాయని పేర్కొన్నారు. ట్రాక్టర్ షోరూం యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు. వాటిని గోడౌన్ కాపలాదారులే దొంగించినట్లు అనుమానించినట్లు తెలిపారు. వాటిలో ఒకటి నువాపుట్‌లో సుకాంత బిశాయికి ఉపేంద్ర గౌధ అమ్మినట్లు, రెండో ట్రాక్టర్‌ను మల్కన్‌గిరి జిల్లా ఎంవీ-28లో గౌతమ్ బచ్చరకు అమ్మివేసినట్లు వెల్లడించారు. పోలీసు దర్యాప్తులో జూన్ 21న ఉపేంద్ర గౌధను అరెస్టు చేశామని, పరారీలో ఉన్న అర్జున్ హరిజన్‌ను ఆదివారం అరెస్టు చేయగలిగామని పేర్కొన్నారు. అమ్మివేసిన రెండు ట్రాక్టర్లను స్వాధీన పరచుకున్నట్లు వెల్లడించారు.

639 కిలోల గంజాయి ధ్వంసం



గంజాయిని ధ్వంసం చేస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లలో ఇటీవల నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన 639.435 కిలోల గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ జిల్లా కేంద్రానికి సమీపంలో సోమవారం ధ్వంసం చేసింది. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. అధికారుల సమక్షంలో గంజాయిని ధ్వంసం చేసినట్లు వివరించింది.

13 మందికి జీవిత ఖైదు



బరంపురం జిల్లా ఎస్‌డీజే కోర్టుకు వస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ రెడ్డి



హత్యకి గురైన పోలీసు అధికారి బినయ్ మెహర్ (ఫైల్)

బరంపురం: పోలీసు అధికారి హత్య కేసులో మాజీ ఎమ్మెల్యే నారాయణ రెడ్డితో పాటు మరో 13 మంది నిందితులకు బరంపురం జిల్లా ఎస్‌డీజే కోర్టు జీవిత ఖైది శిక్ష విధించింది. 1998 సంవత్సరం జూన్ 18వ తేదీన టాటా ఉక్కు కర్మాగారం నిర్మాణం కోసం గంజాం జిల్లా ఛత్రపూర్ బ్లాక్ పరిధి సింధిగామ్‌లో భూ సేకరణ జరిగింది. ఆ సమయంలో స్థానికులు చేపట్టిన అల్లర్లలో పోలీసు అధికారి బినయ్ మెహర్ హత్యకి గురయ్యారు. దీనిపై అప్పట్లో కోర్టు సీపీఐ నాయకుడు ఎస్.నారాయణ రెడ్డితో పాటు మరో 26 మందిని విచారించింది. బరంపురం సర్కిల్ జైలులో విచారణ ఖైదీగా ఉండగా 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గంజాం జిల్లా ఛత్రపూర్ నియోజకవర్గానికి జైలు నుంచి ఎస్.నారాయణ రెడ్డి పోటీచేసి విజయం సాధించాడు. అనంతరం బెయిల్‌పై విడుదలయ్యాడు. సుమారు 25 సంవత్సరాల తర్వాత బరంపురం జిల్లా ఎస్‌డీజే-3 కోర్టులో జడ్జి రాజ కిశోర్ దాస్ 66 మంది సాక్షులను విచారణ జరిపిన అనంతరం, మాజీ ఎమ్మెల్యే నారాయణ రెడ్డితో పాటు 13 మంది నిందితులకు యావజీవ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. వీరిలో ఆరుగురు మృతి చెందగా, మిగతావారు కోర్టులో హాజరైనట్లు పీపీ నిరంజన్ పాఢి చెప్పారు. దీనిపై హైకోర్టుకు వెళ్లనున్నట్లు మాజీ ఎమ్మెల్యే నారాయణ రెడ్డి మీడియాకి తెలిపారు.

ముగ్గురు అధికారుల సస్పెన్షన్

- ఉపారొసొజ్జ ఘటనపై ప్రభుత్వం చర్యలు
- సమగ్ర దర్యాప్తునకు ఆదేశాలు



మాట్లాడుతున్న కలెక్టర్ సింగ్



ఘటన స్థలంలో డీసీసీ అధ్యక్షుడు గొమాంగొ తదితరులు

రాయగడ: జిల్లాలో కల్యాణ సింగుపూర్ సమితి మజ్జిగుడ పంచాయతీలోని ఉపారొసొజ్జ గ్రామంలో సోమవారం కల్వర్టు సెంట్రింగ్ కూలిన ఘటనలో ఐదుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన ప్రభుత్వం అందుకు సంబంధించి రూరల్ డవలప్‌మెంట్ డివిజన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రదీప్ కుమార్ మహంతి, అసిస్టెంట్ ఇంజినీర్ రాజేష్ కుమార్ మండల్, జూనియర్ ఇంజినీర్ వెంకటరమణ ముదిలిలను సస్పెండ్ చేసింది. ఈ మేరకు ఆ శాఖ కార్యదర్శి సంజయ్ సింహ సోమవారం రాత్రి ఉత్తర్వులను జారీ చేశారు. వారి నిర్లక్ష్యం కారణంగా నిండు ప్రాణాలు బలయ్యాయని, సమగ్ర దర్యాప్తు జరిపిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాంట్రాక్టర్‌పై కేసు నమోదు

కల్వర్టు కూలిన ఘటనలో సమగ్ర దర్యాప్తు చేపట్టి ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తామని జిల్లా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ తెలియజేశారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. ఇది చాలా దురదృష్టకరమైన సంఘటన అన్నారు. కల్వర్టు నిర్మాణానికి సంబంధించిన కాంట్రాక్టర్‌పై ఇప్పటికే కేసు నమోదయ్యిందని పేర్కొన్నారు.

చర్యలు తీసుకోవాలి

బాధితులకు నష్ట పరిహారం చెల్లించి చేతులు దులుపుకోకుండా, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బిజయ్ కుమార్ గొమాంగొ డిమాండ్ చేశారు. ఘటనా స్థలానికి ఆయన చేరుకొని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇటువంటి తరహా ఘటనలు పునరావృతమవ్వకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నా, తగిన పర్యవేక్షణ లేకపోవడంతో నిధులు పక్కదారి పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని సూచించారు.

క్లుప్తంగా

మో ఘరొ యోజనపై అవగాహన



అవగాహన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: జయపురం సబ్ డివిజన్ కుంద్రా సమితిలో మో ఘరొ యోజనపై లబ్ధిదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. కుంద్రా సమితి కార్యాలయ సభా గృహంలో సమితి బీడీవో బిచిత్రానంద నాయిక్ సచేతన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పథకంలో సమితిలో అత్యధికంగా లబ్ధిదారులను చేర్చాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.1 లక్ష నుంచి రూ.3 లక్షల వరకు అప్పు ఇవ్వడం జరుగుతుందన్నారు. అప్పు తీసుకొని ఇల్లు నిర్మించుకునే ఆదివాసీ, హరిజన, సాధారణ వర్గ ప్రజలకు సబ్సిడీ లభిస్తుందని పేర్కొన్నారు. పథకంలో రుణం ఎలా లభిస్తుంది, ఇల్లు కట్టిన తర్వాత అప్పు ఎలా తీర్చాలి అనే విషయాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు బీడీవో రామప్రసాద్ దొర, కుంద్ర తహసీల్దార్ అయాబ్ మండల్, ఏపీఈవో రజనీకాంత బెహర తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా వర్షం

పర్లాకిమిడి: బంగళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో గజపతి జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో గత రెండు రోజులుగా ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు ఉపశమనం లభించింది. ఆర్.ఉదయగిరిలో అధికంగా 44.3 మి.మీటర్ల వర్షం కురవగా, అత్యల్పంగా గుసాని సమితిలో 4 మి.మీటర్ల వర్షం కురిసింది. పర్లాకిమిడిలో 4.8, కాశీనగర్‌లో 6.0, గుమ్మాలో 10.0, రాయగడలో 11.0, మోహనా సమితిలో 3.6 మి.మీటర్ల వర్షం కురిసింది. ఈ వర్షంతో మెట్టప్రాంతం ప్రాంతంలో వరినాట్లు జరుగుతున్నాయి.

'మూత్రగండాలు'పై కవితలకు ఆహ్వానం

పలాస: ఉద్దానం ప్రాంతంలో మూత్ర పిండాల వ్యాధులపై కవులు, కళాకారులు స్పందించాలని, సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు 'మూత్ర గండాలు' అనే శీర్షికపై కవితలు, పాటలను ఆహ్వానిస్తున్నామని పలాస మండలం రంగోయి గ్రామానికి చెందిన గిడుగు రామ్మూర్తి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బద్రి కూర్మారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 30లోగా బద్రి కూర్మారావు, డోర్ నెంబరు 26-3-26, కొత్తవీధి, దాసన్నపేట, విజయనగరం -535002 చిరునామాకు పంపించాలని కోరారు. ఎంపిక చేసిన వాటిని పుస్తక రూపంగా తీసుకురావాలని భావిస్తున్నామని తెలిపారు. రంగోయి గ్రామంలోని వివేకానంద, నారాయణగురు చైతన్య సంఘం, కళింగసీమ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేపు దంతలో ప్రజాభిప్రాయ సేకరణ

కోటబొమ్మాళి : మండలంలోని దంత గ్రామ పంచాయతీని సారవకోట మండలంలో విలీనం చేయాలని సర్పంచ్‌తో పాటు కొందరు గ్రామస్తులు ఇటీవల కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు దరఖాస్తు చేశారు. ఈ మేరకు గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించడంతో టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించనున్నారు. రెండు మండలాలకు చెందిన ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆహ్వానాలు అందించినట్లు కోటబొమ్మాళి డీటీ రఘుపతి మధు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆదిత్యుని సన్నిధిలో ఎస్‌బీఐ డీజీఎం



రంగరాజన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని అమరావతి ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.రంగరాజన్ సతీసమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు.ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ ఆలయానికి రెండేళ్ల క్రితం సేఫ్టీ లాకర్‌ను ఇచ్చామని, ఇప్పుడు మెటల్ డిటెక్టర్ల ఏర్పాటుతో పాటు సెల్‌ఫోన్ల జామర్‌ను త్వరలో అందజేస్తానని ప్రకటించారు. ఈయన వెంట భార్య, కెనరా బ్యాంకు ఏజీఎం ఇందిరన్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలి

అరసవల్లి: విద్యుత్ ఉద్యోగులకు సంబంధించిన 12 డిమాండ్లను యాజమాన్యం, ప్రభుత్వం పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ జి.రమేష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ కార్యాచరణ మేరకు మంగళవారం విద్యుత్ ఉద్యోగులతో డేఅండ్‌నైట్ కూడలి నుంచి స్థానిక విద్యుత్ సర్కిల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్కిల్ కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ చైర్మన్ ఎం.వి.గోపాలరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, కో-కన్వీనర్ జె.సురేష్‌కుమార్, శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

5 గ్రామాలకు వరద ముంపు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మోటు ప్రాంతంలో ఉన్న వినాయక్‌పూర్, అల్మా, పేట, కోయిగూర్, లక్ష్మీపురం గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి. గోదావరి ఉద్ధృతి పెరగడంతో శబరి, సీలేరు నదుల నుంచి గ్రామల్లోకి వరద నీరు చేరింది. దీంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. మరోపక్క వారం రోజులుగా లారీలు నిలిచిపోయాయి. లారీల డ్రైవర్లు అక్కడే వండుకొని తింటున్నారు. అయితే తాము తీసుకొచ్చి సామగ్రి సైతం అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కోయగూర్ గ్రామం వద్ద వంతెనపై నీరు తగ్గితేనే లారీలు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. దీంతో విజయవాడ, చిత్తూరు, ఛత్తీస్‌ఘడ్, హైదరాబాద్‌కు తీసుకెళ్లాల్సిన గుడ్లు, పనీర్, టామాటోలు పాడైపోయాయి. అందువలన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని డ్రైవర్లు కోరుతున్నారు.



లక్ష్మీపురం గ్రామంలో రహదారిపైకి చేరిన నీరు



రోడ్డుపైనే నిలిచిన లారీలు



నాటు పడవలో వినాయకపూర్ గ్రామానికి వెళ్తున్న దృశ్యం

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



మాట్లాడుతున్న మంత్రి జగన్నాథ సరక

- మంత్రి జగన్నాథ సరక

రాయగడ: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి, బంగారు భవితకు బాటలు వేసుకోవాలని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక సూచించారు. జిల్లాలోని రామనగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు 5టీ పథకాన్ని ప్రారంభించిందన్నారు. పాఠశాలలను ఆధునీకీకరించి ఆధునిక, సాంకేతిక విద్యను అందిస్తోందని పేర్కొన్నారు. రామనగుడలో పాఠశాలను 5టీ పథకంలోకి తీసుకొచ్చేవిధంగా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు విద్యాశాఖ అధికారి భజన్‌లాల్ మారిఖ, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగొ, బీడీవో ప్రద్యుమ్న కుమార్ మండల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేడీ నాయకుడిపై ఫిర్యాదు



కాశీనాయుడు

రాయగడ: జిల్లాలోని శశిఖాల్ పోలీసుస్టేషన్‌లో అధికార బీజేడీ సీనియర్ నాయకుడు ఆర్.కాశీనాయుడిపై ఫిర్యాదు నమోదయ్యింది. కాశీనాయుడు తనపై దాడిచేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని చిన్నపుడు పువ్వల అనే వ్యక్తి మంగళవారం ఫిర్యాదు చేశాడు. నాలుగు నెలల క్రితం ఖిలిమిసిగుడ వద్దనున్న ఇసుక ర్యాంప్‌ను లీజుకు తీసుకున్నానని, రూ.18 లక్షలు ఇవ్వకపోతే ర్యాంప్ ఎలా నడిపిస్తావో చూస్తానని హెచ్చరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగళవారం రాత్రి కొంతమంది మద్దతుదారులతో తనపై దాడికి దిగాడని, తుపాకీని తనపై గురిపెట్టి హత్య చేస్తానని బెదించడంతో గత్యంతరం లేక పారిపోయానని వివరించాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

కవిటి: మండలంలోని కవిటి-ఈదుపురం రోడ్డులో కొరికానపుట్టుగ సమీపంలో రోడ్డుపక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని కారు బలంగా ఢీకొట్టడంతో స్తంభం ఒరిగిపోయింది. కవిటి వైపు నుంచి వెళుతున్న కారు ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. స్తంభం ఒరిగానా వైర్లు తెగలేదని, ఏమాత్రం వైర్లు తగిలినా పెను ప్రమాదం జరిగిఉండేదని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ నుంచి విద్యుత్‌శాఖ నిబంధనల ప్రకారం నష్టపరిహారాన్ని వసూలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.



పొదల్లోకి దూసుకెళ్లిన కారు

వెళ్లిపోయావా తమ్ముడూ..!

- పాముకాటుతో తొమ్మిదో తరగతి విద్యార్థి మృతి
- అక్కకు తప్పిన ముప్పు
- ఇంట్లోకి వెళ్లి కాటు వేసిన కట్లపాము
- తోలాపిలో విషాదఛాయలు





విద్యార్థి మృతదేహం, కాటువేసిన పాము

పొందూరు: రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం వారిది. తల్లి తీవ్ర అనారోగ్యంతో శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. తండ్రి తాపీ పనిచేసేందుకు కొద్ది రోజుల క్రితం రాజమండ్రి వెళ్లాడు. అక్క, తమ్ముడు కలిసి ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో కట్లపాటు కాటు వేయడంతో తమ్ముడు మృత్యువాతపడ్డాడు. ఈ విషాద ఘటన పొందూరు మండలం తోలాపిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..

తోలాపి ఎస్సీ కాలనీలో నివాసముంటున్న రావాడ చిన్నయ్య, నీలవేణికి కుమార్తె రమ్య, కుమారుడు లవకుమార్(14) ఉన్నారు. లవకుమార్ తోలాపి జెడ్పీ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. చిన్నయ్య, నీలవేణి రోజువారీ కూలీలు. నీలవేణికి అనారోగ్యం కారణంగా శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కుటుంబ పోషణ కోసం చిన్నయ్య రెండు రోజుల క్రితం రాజమండ్రి వెళ్లాడు. దీంతో అక్క రమ్యతో కలిసి లవకుమార్ ఇంటిలో ఉంటున్నారు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో గాలి తగలడం లేదని తలుపుతీసి పడుకున్నారు. ఆ సమయంలో కట్లపాము లవకుమార్‌ను కాటువేసింది. మెలకువ రావడంతో ఏదో పురుగు కుట్టిందనుకుని నిద్రలోకి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత పాము మెడకు చుట్టినట్లు అనిపించడంతో ఒక్కసారిగా నిద్రలేచి పామును గుర్తించాడు. పామును విసిరేస్తే అక్కకు ప్రమాదం జరుగుతుందని గ్రహించి భయపడకుండా చేతితో తీసి నేలకు గట్టిగా కొట్టాడు. తర్వాత పామును కొట్టి చంపాడు. అలికిడి కావడంతో అక్క నిద్రలోనుంచి లేచింది. అప్పటికే పాము కరిచి చాలాసేపు కావడం, తమ్ముడి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉండటంతో బయటకు వెళ్లి చుట్టుపక్కల వారిని పిలిచింది. వారు లవకుమార్‌ను శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. అప్పటి వరకు తనతో ఉన్న తమ్ముడు పాముకాటుకు బలికావడంతో అక్క కన్నీటిపర్యంతమైంది. తల్లిదండ్రులకు విషయాన్ని చేరవేసింది. వారు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ముందు రోజు వరకు రోజూ పాఠశాలకు వస్తున్న విద్యార్థి ఇక లేడని తెలిసి ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు విషాదంలో మునిగిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి మృదేహానికి పోస్టుమార్టం చేయించారు.

వైద్యారోగ్య శాఖపై కలెక్టర్ ఆగ్రహం

- పలువురు అధికారులకు షోకాజ్ నోటీసులు
- ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారిని సెలవులోకి పంపించాలని డీఎంహెచ్‌ఓకు ఆదేశం
- సర్వే, ఆన్‌లైన్ అప్‌లోడ్‌లో నిర్లక్ష్యంపై మండిపాటు



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేశ్ బి లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైద్యులు రోగులకు మెరుగైన సేవలు అందించాలని, వ్యాధి పూర్తిగా నయమయ్యేంత వరకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్.సి.డి.సర్వే, బీపీ, షుగర్ రోగుల నమోదు, చికిత్స వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం తదితర వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. తక్కువగా అప్‌లోడ్ చేసిన గంగువాడ, చౌర్లంగి, మాకివలస, జి.సిగడాం, సింగుపురం పీహెచ్‌సీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ షోకాజ్ నోటీసులు జారీచేశారు. టెక్కలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న డాక్టర్ లక్ష్మి తులసీని పలాసకు బదిలీ చేయాలని డీఎంహెచ్‌ఓ మీనాక్షిని ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న డి.పి.హెచ్.ఎన్.ఓ శైలజను మందలిస్తూ షోకాజ్ నోటీసులు జారీచేయాలని ఆదేశించారు. కారణాలు చెబితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. చక్కగా పనిచేసిన కింతలి, తొగరాం వైద్యాధికారులను అభినందించారు.

- ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సి.పి.శ్రీదేవిని సెలవులోకి పంపించాలని డీఎంహెచ్‌ఓను కలెక్టర్ ఆదేశించారు. అర్బన్ హెల్త్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ లింగరాజు పనితీరు మెరుగుపరుచుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

కోటబొమ్మాళిలో దొంగల కలకలం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి విద్యుత్‌నగర్ కాలనీలో పగటిపూట ఇద్దరు దొంగలు సంచరించడం స్థానికంగా కలకలం రేపింది. మంగళవారం మధ్యాహ్నం ఇద్దరు వ్యక్తులు టీవీ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులు అమ్ముతూ వీధుల్లో తిరిగారు. ఈ క్రమంలో బొమ్మాళి ఎంకయ్య ఇంట్లో ఎవరూ లేని విషయం గుర్తించి ఓ వ్యక్తి బయటే ఉండి, మరో వ్యక్తి ఇంట్లోకి చొరబడి వెండి, వంట సామగ్రితో పారిపోతుండగా ఆ మూట చేయిజారి రోడ్డుపై పడింది. అందులో సామగ్రి రోడ్డుపై చెల్లాచెదురుగా పడటంతో శబ్దం విని స్థానికులు దొంగలను పట్టుకొనే ప్రయత్నం చేశారు. అప్పటికే దొంగలు తప్పించుకొని పారిపోయారు. ఈ ఘటనపై పిర్యాదు అందలేదని, అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

గంజాయి కేసులో వ్యక్తి అరెస్టు

జలుమూరు: మండలంలోని లింగాలవలసలో గంజాయితో పట్టుబడిన మెజ్జాడ సరస్వతిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పి.పారినాయుడు మంగళవారం తెలిపారు.స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూర్ సిబ్బంది, స్థానిక పోలీసులకు వచ్చిన సమచారం మేరకు సరస్వతి ఇంటి వద్ద తనిఖీలు నిర్వహించగా సుమారు 11 కేజీల గంజాయిని గుర్తించినట్లు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.55 వేలు ఉంటుందని అంచనా. ఈమెను అరెస్ట్ చేసి కోటబొమ్మాళి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. నరసన్నపేట సీఐ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అత్యాచారం కేసులో వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష

సారవకోట: మూగుపురం గ్రామానికి చెందిన ఎడ్ల సూర్యనారాయణ అలియాస్ రవికుమార్‌కు ఎస్సీ, ఎస్టీ కోర్టు మంగళవారం 20 సంవత్సరాల కారాగార శిక్ష విధించింది. 2021 ఆగస్టు 19న మూగుపురం గ్రామానికి చెందిన మూగ, చెవుడు, మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారం చేసినట్లు ఆమె తల్లి సారవకోట పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసింది. అత్యాచారం, సీ్స, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముద్దాయిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. మంగళవారం కోర్టు తీర్పునిస్తూ 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.51 వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ అప్పారావు తెలిపారు.

చివరిదశకు ఆరో సెమిస్టర్ 'స్పాట్'

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ఆరో సెమిస్టర్ స్పాట్ వాల్యుయేషన్ చివరి దశకు చేరుకుంది. ఐదు కేంద్రాల్లో మూల్యాంకణ జరుగుతుండగా నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజాం జీసీఎస్ఆర్, శ్రీకాకుళం రూరల్ గాయత్రి కేంద్రాల్లో మంగళవారంతో ముగిసింది. ఈ నెల మూడు నాటికి శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాల కేంద్రంలో స్పాట్ ముగియ నుంది. పీజీ ప్రవేశాల నోటిఫికేషన్ త్వరలో రానున్న నేపథ్యంలో ఫలితాలు త్వరితగతిన విడుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఎస్పీ స్వాతి ఎస్.కుమార్

- ఎస్పీ స్వాతి ఎస్.కుమార్

పర్లాకిమిడి: ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, సీనియర్లు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ సూచించారు. స్థానిక శ్రీకృష్ణచంద్ర గజపతి స్వయం ప్రతిపత్తి కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె విద్యార్థులతో మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరితో మర్యాదగా నడుచుకోవాలని, తల్లిదండ్రుల కలలు సాకారం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. 'ర్యాగింగ్ రహిత కళాశాల క్యాంపస్'పై కలలు కందాం అనే టాపిక్‌పై మాట్లాడారు. బీటెక్ ఇంజినీరింగ్ చదివి ఐపీఎస్‌పై దృష్టిపెట్టి జీవితంలో ఉన్నత శిఖరాలను అందుకున్నానని, దీనికి తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉందన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా.జె.ఎస్.పట్నాయిక్, రాధాకాంత భయ్యాన్, ప్రిన్సిపాల్ డా.అజయ్ కుమార్ త్రిపాఠి, ప్రొఫెసర్ ఆర్.నీరజ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లెస్ జువైనల్ కోర్టు ప్రారంభం



కోర్టు ప్రారంభోత్సవంలో పాల్గొన్న జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్ తదితరులు

పర్లాకిమిడి: స్థానిక రెల్లివీధి రోడ్డులోని పాత కోర్టు భవనంలో మంగళవారం ఉదయం పేపర్ లెస్ జువైనల్ కోర్టును వర్చువల్‌గా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డా.మురళీధర్ కటక్ నుంచి ప్రారంభించారు. పేపర్ లెస్ కిశోర న్యాయకోర్టుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని భౌతికంగా కక్షిదారులు కోర్టుకు రాకుండా, సరైన న్యాయం ప్రతి ఒక్కరూ పొందవచ్చని గజపతి జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్ అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పృథ్వీరాజ్ చౌహాన్, చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నరోత్తమ శెఠి, ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్, జువెనైల్ జస్టిస్ బోర్డు సత్యవ్రత రాణా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దుల్లు మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

పూజ గదిలో ప్రమాదం

- రూ. 2 లక్షల ఆస్తి నష్టం



కాలిబూడిదైన ఫ్రిజ్



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని గూనపాలెం సమీపంలో సబ్ డివిజనల్ పోలీస్ కేంద్రం వెనుక ఉన్న రేకుల ఇంట్లో దీపం ఒత్తి కారణంగా అగ్నిప్రమాదం సంభవించినట్లు జిల్లా అగ్నిమాపక సహాయాధికారి వరప్రసాదరావు పేర్కొన్నారు. ఆయన తెలిపి వివరాల ప్రకారం. పట్నాన శేఖర్ కార్పెంటర్‌గా పనిచేస్తూ భార్య, ఇద్దరు పిల్లలతో కలిపి రేకుల ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. మంగళవారం పనిమీద ఇద్దరూ బయటకు వెళ్లారు. పిల్లలూ స్కూల్‌కు వెళ్లిపోవడంతో ఇంట్లో ఉన్న దేవుని పటాల వద్ద దీపం ఒత్తి ముందు ఉన్న చాపకు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. ఇల్లు ఇరుకుగా ఉండటం, సామాన్లన్నీ ఒకేచోట ఉండటంతో మంటలు అంటుకున్నాయి. బయటకూ పొగ రాకపోవడంతో ఎవ్వరికీ తెలియలేదు. కొద్దిసేపటి తర్వాత శేఖర్ భార్య ఇంటి తలుపు తెరిచేసరికి పొగ, మంటలు ఒక్కసారిగా ఎగిశాయి. ఈలోగా అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయగా లీడింగ్ ఫైర్‌మేన్ పి.షణ్ముఖరావు ఆధ్వర్యంలో సిబ్బంది కూర్మారావు, రహీమ్, భట్లు, రాజు ఘటనాస్థలికి చేరి మంటలు అదుపుచేశారు. అప్పటికే టీవీ, ఫ్రిజ్, కూలర్, మంచం, గ్రైండర్, హోమ్ థియేటర్, బీరువా, తదితర సామగ్రి బూడిదయ్యాయి. రూ. 2 లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని ఏడీఎఫ్ఓ చెప్పారు. కష్టపడి కొనుక్కున్న వస్తువులన్నీ కాలిపోయాయని బాధితులు విచారం వ్యక్తం చేశారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

మెళియాపుట్టి: మండలంలోని గొప్పిలి గ్రామానికి చెందిన వృద్ధుడు చెరువులో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. కూర పాత్రో(69) అనేవృద్ధుడు గ్రామంలోని గజపతి మహారాణి చెరువుకు స్నానానికి వెళ్లాడు. ఈత రాక పోవడంతో మునిగిపోయాడు.

స్థానికులు గుర్తించి బయటికి తీసినప్పటికే మృతిచెందాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



వృద్ధుడి మృతదేహం

ఐదుగురిపై కేసు నమోదు

జి.సిగడాం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న ఎం.కృష్ణారావుకు విధులకు ఆటంకం కలిగిస్తూ దుర్భాషలాడిన జి.సిగడాం గ్రామానికి చెందిన రెడ్డి తాతతోపాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సామంతుల రామారావు మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన రెడ్డి ఆదినారాయణ తమ భూమికి సంబంధించి న్యాయం చేయాలని పొందూరు కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు మేరకు తమ భూమి అప్పగించాలని కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 91/2,91/3,91/8,139/9 సర్వేనెంబరులో ఉన్న భూమిని అప్పగించడానికి వీఆర్ఓ, ఆర్ఐ కలిసి భూమి హద్దులు వేశారు. దీంతో రెడ్డి తాత, మరో నలుగురు తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి దుర్భాషలాడారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంట్ టెస్టులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 7 వరకు జరగనున్న శాఖాపరమైన పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు జిల్లాలో శ్రీశివానీ, శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలను కేంద్రాలుగా కేటాయించినట్లు తెలిపారు. 1511 మంది ఉద్యోగులు హాజరుకానున్నట్లు చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. కేంద్రాల 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని, అభ్యర్థులకు సరిపడా ఆర్టీసీ బస్సులు నడపాలని సంబంధిత అధికారులకు సూచించారు. గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. సెల్ ఫోన్లు తీసుకురావద్దని సూచించారు. సర్వీసు రూల్స్ పుస్తకాలు మాత్రమే తీసుకురావాలన్నారు. పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని సూచించారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ బి.సీహెచ్.కుమార్ రాజా, సెక్షన్ ఆఫీసర్ ప్రతాప్, అడిషనల్ ఎస్పీ తిప్పేస్వామి రమణ, వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్వో మురళీకృష్ణ

క్లుప్తంగా

ఉరివేసుకుని యువతి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన పుష్ప

మెంటాడ: మండలంలోని పిట్టాడ గ్రామానికి చెందిన గొర్లె పుష్ప (17) మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరివేసుకుంది. విషయం తెలుసుకున్న స్థానికులు మెంటాడ ఆస్పత్రికి హుటాహుటిన తరలించగా అప్పటికే మృతిచెందినట్లు ఆస్పత్రి సిబ్బంది ధ్రువీకరించారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న సీఐ లెంక అప్పలనాయుడు, గజపతినగరం ఎస్సై గంగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని యువతి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. మృతురాలి తల్లిదండ్రులు స్థానికంగా లేకపోవడంతో స్పష్టమైన వివరాలు తెలియరాలేదని, యువతి బంధువుల నుంచి ఇంకా ఫిర్యాదు అందలేదని సీఐ, ఎస్సైలు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్త గజపతినగరం ఆస్పత్రికి మృతదేహాన్ని తలలించినట్లు చెప్పారు. ఫిర్యాదు వచ్చిన అనంతరం దర్యాప్తు చేపడతామన్నారు.

జ్వరంతో విద్యార్థి మృతి


విద్యార్థి మహేంద్ర(ఫైల్)

మక్కువ: మండలంలోని నంద గ్రామానికి చెందిన విద్యార్థి బిడ్డిక మహేంద్ర (15) జ్వరంతో మృతి చెందినట్లు తెలిసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మహేంద్ర ఎర్ర సామంతవలస ఆశ్రమ పాఠశాలలో పదవతరగతి చదువుతున్నాడు. గత నెల 27వ తేదీన కండ్ల కలక రావడంతో వసతి గృహం నుంచి గ్రామానికి చేరుకున్నాడు. గ్రామంలోని ఆర్ఎంపీ డాక్టర్ వద్ద రెండు రోజుల పాటు వైద్య సేవలు పొందాడు. మహేంద్రకు జ్వరం రావడంతో మక్కువలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చి వైద్యసేవలందజేసినప్పటికీ జ్వరం తీవ్రం కావడంతో మంగళవారం కన్నుమూశాడు. మహేంద్ర మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

గిరిజనుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు



మాట్లాడుతున్న డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం కల్పిస్తూ తన కర్తవ్యాన్ని, బాధ్యతలను నిర్వర్తిస్తానని రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ వారిలో చైతన్యం నింపుతానని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ గిరిజన ప్రజలను నాగరికత, అభివృద్ధికి మరింత చేరువ చేసేందుకు కమిషన్ తరఫున తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా మంగళవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ అతిథిగృహంలో విలేకరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గిరిజన ప్రజల దీర్ఘకాలిక సమస్యలు, హక్కులు, చట్టాల పర్యవేక్షణ, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై మాట్లాడారు. కమిషన్ తరఫున రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తామని, వారి హక్కులు, చట్టాల అమలుపై గిరిజనుల్లో చైతన్యం నింపుతామని స్పష్టం చేశారు. ఎస్టీకుల ధ్రువీకరణ పత్రాల జారీ, డోలీ కష్టాలు, బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చడం, విజయనగరం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు, గిరిజన ప్రాంతాల్లో రోడ్ల సదుపాయాలపై విలేకరులు ప్రశ్నించగా క్షేత్రస్థాయి పర్యటనలు చేసి పరిశీలించి పూర్తిస్థాయి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.

ఘనంగా లక్ష కుంకుమార్చన


శ్రీ వైభవలక్ష్మి అమ్మవారి విగ్రహం వద్ద పూజలు

డెంకాడ: మండలంలోని చింతలవలస ఐదవ ఏపీఎస్‌పీ బెటాలియన్ వద్ద ఉన్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష కుంకుమార్చన పూజలు మంగళవారం ఘనంగా జరిగాయి. అధిక శ్రావణమాస పౌర్ణమి సందర్భంగా శ్రీ వైభవలక్ష్మి అమ్మవారికి పండితుల మంత్రోచ్చారణతో భక్తులు లక్ష కుంకుమార్చన చేశారు. అనంతరం లక్ష్మీనారాయణ హోమం నిర్వహించారు.


వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష కుంకుమార్చన చేస్తున్న భక్తులు

సహకారానికి గుర్తింపు

- జిల్లాలో ప్రథమస్థానం సాధించిన కెల్ల సొసైటీ
- మల్టీ సర్వీస్ కోఆపరేటివ్ సొసైటీగా రూపాంతరం
- రూ.85 వేల నుంచి రూ.22 కోట్లకు పెరిగిన టర్నోవర్


కెల్ల సొసైటీ గోదాములు


కెల్ల సొసైటీ భవనం

గుర్ల: సహకారం సంఘాలు సంప్రదాయంగా రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరా, రుణాల అందజేత మాత్రమే కాకుండా వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తున్నాయి. అలాంటి వాటిలో కెల్ల సొసైటీ ముందువరుసలో ఉంది. ఒకప్పుడు రైతులకు మాత్రమే సేవలందించే ప్రాథమిక సహకార సంఘాలు సామాన్యులకు కూడా అవసరమైన ప్రస్తుతం సేవలు సైతం అందిస్తున్నాయి. గతంలో ఎరువులు, పురుగు మందులు అమ్మకాలకు మాత్రమే పరిమితమైనా ప్రస్తుతం బహుళ సేవా సహకార పరపతి సంఘాలుగా (మల్టీ సర్వీసెస్) మారుతున్నాయి. ఇలా వినూత్న కార్యక్రమాలు చేపడుతున్న కెల్ల సొసైటీ జిల్లాలో ఉత్తమ సొసైటీగా అవార్డును కైవసం చేసుకుంది.ఈ అవార్డును ఈనెల4న విజయవాడలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా సొసైటీ చైర్మన్ కేవీ సూర్యనారాయణ రాజు అందుకోనున్నారు.

పెరిగిన టర్నోవర్

కెల్ల సొసైటీ అధ్యక్షుడిగా కేవీ సూర్యనారాయణ రాజు(పులిరాజు) 1987లో బాధ్యతలు చేపట్టారు. అప్పట్లో రూ. 87 వేలు వ్యాపారం ఉండేది. 2023 నాటికి రూ.22 కోట్లు 46 లక్షల టర్నోవర్ అయ్యేలా ఆయన అభివృద్ధి చేశారు. 1987 నుంచి నేటివరకు ఆయనే సొసైటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కెల్ల సొసైటీ ప్రస్తుతం సుమారు రూ.1.90 కోట్ల లాభంలో ఉంది.

గోదాముల నిర్మాణం

రైతులు వారి ఉత్పత్తులు నిల్వచేసుకునే అవకాశం


అప్కాబ్ అధికారులు పంపించిన ఉత్తమ సొసైటీ పత్రాన్ని చూపిస్తున్న కేవీ సూర్యనారాయణ రాజు

లేక అయినకాడికి అమ్ముకుని నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో వారు ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు సొసైటీ పరిధిలో సుమారు రూ.60 లక్షల వ్యయంతో ఒకటి, రూ.40 లక్షలతో బెల్లాన పేట వద్ద మరో గోదాము నిర్మించారు. ప్రభుత్వం కొంత నిధులను మంజూరు చేస్తే వాటికి సొసైటీ పరిధిలోని నిధులను జోడించి గోదాముల నిర్మాణం పూర్తి చేశారు. అలాగే ఈ సొసైటీ ముందు ప్లాట్‌ఫాం నిర్మాణాలు చేపట్టి అవరణంలో మొక్కలు నాటి పర్యావరణం పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలతో లాభాల బాట

ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను కెల్ల, తెట్టంగి, జమ్ముపేట, గుర్ల సొసైటీలలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం వల్ల ఈ సొసైటీలు లాభాల బాటలో నడుస్తున్నాయి. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయడం , తగిన సమయంలో వారి ఖాతాకు ధాన్యం అమ్మిన నగదు అందించడం వల్ల రైతులు సొసైటీల ఆధ్వర్యంలో పంట అమ్మకానికి ఇష్టపడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వల్ల సొసైటీలు లాభాలబాట పట్టాయి

అందరి సహకారంతోనే సాధ్యం



రైతులను భాగస్వామ్యం చేయడం వల్ల సొసైటీ అభివృద్ధి చెందింది. జిల్లాలో ప్రథమ స్థానం సాధించడం చాలా సంతోషంగా ఉంది. రైతులకు అవసరమైన అన్ని సేవలను సొసైటీ దగ్గర అందిస్తున్నాం. 35 ఏళ్లగా సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నుకుంటున్న రైతులకు రుణపడి ఉంటాను.

– కేవీ సూర్యనారాయణ రాజు, సొసైటీ అధ్యక్షుడు, కెల్ల

మల్టీ సర్వీసుల ప్రారంభానికి సన్నాహాలు

మండలంలోని కెల్ల సొసైటీలో మల్టీ సర్వీసుల ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు. సొసైటీ అద్వర్యంలో జనరిక్ మందుల షాపు, సీఎస్‌సీ కేంద్రాలు, సొసైటీ వద్ద ఎటీఎం సేవలు అందుబాటులోకి తీసుకురానున్నారు. సొసైటీలో బంగారు ఆభరణాలపై రుణాలు ఇవ్వడంతో పాటు లాకర్ సుదపాయం కల్పించారు. .

రైతులకు డివిడెండ్‌ల పంపిణీ

కెల్ల సొసైటీలలో ప్రతి ఏడాది వచ్చిన లాభాల్లో రైతులకు డివిడెండ్‌లు కూడా పంపిణీ చేస్తారు. రైతుల అవసరం మేరకు రుణాలు మాత్రమే ఇచ్చే సొసైటీలు ఉన్నాయి. కాని ఈ సొసైటీని లాభాల బాటలో నడిపించడంలో రైతులను భాగస్వామ్యం చేస్తారు. ఈఏడాది 2095 మంది రైతులకు 6.78 లక్షలను డివిడెండ్ అందజేయనున్నారు.

పిచ్చికుక్క దాడిలో 13 మందికి గాయాలు

- బొండపల్లి పీహెచ్‌సీలో బాధితులను నందర్శించిన డీఎంహెచ్‌ఓ


సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న కుక్కకాటు బాధితులు

బొండపల్లి: మండల కేంద్రం బొండపల్లితో పాటు పంచాయతీలోని మధుర గ్రామమైన చందకపేటలో రెండు రోజులుగా పిచ్చికుక్క దాడి చేసి 13 మందిని గాయపరిచింది. వివరాలిలా ఉన్నాయి. దీంతో బాధితులు బొండపల్లి పీహెచ్‌సీలో చికిత్స నిమిత్తం చేరారు. బాధితుల్లో నెల్లిమర్ల మాణిక్యానికి తీవ్ర గాయాలు కావడంతో ప్రథమ చికిత్స తరువాత గజపతినగరంలోని సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రికి తరలించారు. గజపతినగరం సీహెచ్‌సీలో జి.అచ్చియ్యమ్మ, బి.జగన్నాథం, కె.త్రినాథ చికిత్స పొందుతుండగా బొండపల్లి పీహెచ్‌సీలో ఎ.అరుణ, కె.సత్యనారాయణ, జి.కామాక్షి, యు.నాగేశ్వరావు, టి.త్రినాథ, సీహెచ్.దేవుడమ్మ, ఎల్.రామలక్ష్మిలు చికిత్స పొందిన తర్వాత ఇంటికి వెళ్లిపోయారు. ఈ విషయం తెలుసుకున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు బొండపల్లి పీహెచ్‌సీని తహసీల్దార్ డి.ప్రసాదరావు, ఎంపీడీఓ వైవీ రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి పరిశీలించి బాధితుల వివరాలతో పాటు వారికి అందించిన వైద్య సేవలపై వైద్యాధికారిణి ఆర్.అమృతవల్లిని అడిగి తెలుసుకున్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు


పార్వతీపురం: వీరఘట్టం మండల కేంద్రానికి చెందిన అంటిపేట లక్ష్మి పొలం పనుల కోసం వెళ్తుండగా వీరఘట్టం నుంచి పాలకొండ వెళ్తున్న ద్విచక్ర వాహనం వెనుకనుంచి ఢీకొట్టడంతో పలు చోట్ల గాయాలయ్యాయి. ఈ మేరకు చికిత్స కోసం వీరఘట్టం పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అలాగే వాహనం నడిపిన షాజహాన్‌కు కూడా పలు చోట్ల గాయాలు కావడంతో పార్వతీపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్‌కు..

మెంటాడ: మండల కేంద్రానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సుంకరిరమణ జయితి గ్రామం నుంచి అమరాయవలస హరిత రహదారి ప్రాంతానికి వెళ్తుండగా ట్రాక్టర్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తీవ్రగాయాల పాలవడంతో జిల్లా కేంద్రాస్పత్రికి చికిత్స నిమిత్త తరలించారు.

కత్తిపీట మీద పడి మరో వ్యక్తి..

జామి: మండలంలోని లొట్లపల్లి గ్రామానికి చెందిన వెల్దూరి ఎర్నాయుడు(32) మంగళవారం రాత్రి కత్తిపీట మీద పడడంతో మెడమీద తెగి తీవ్ర గాయాలపాలయ్యాడు. గాయాలపాలైన వ్యక్తికి 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


చికిత్స పొందుతున్న లక్ష్మి, చికిత్స పొందుతున్న షాజహాన్

వీడిన హత్య కేసు మిస్టరీ

- నిందితుడి అరెస్ట్
- సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు

శృంగవరపుకోట: మూడు రోజుల క్రితం ఎస్.కోట పట్టణాన్ని ఉలిక్కి పడేలా చేసిన స్థానిక చందన్ లాడ్జిలో మహిళ హత్య కేసు మిస్టరీ వీడింది. ఈ కేసుకు సంబంధించి మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ ఆర్.గోవిందరావు వివరాలు తెలియజేశారు. ఈనెల 30వ తేదీన ఎస్.కోటలోని చందన్ లాడ్జి మేనేజర్ గనివాడ శ్రీనివాసరావు లాడ్జిలో ఒక మహిళ మృతి చెందినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా హత్య కేసు నమోదు చేసి, ఘటనాస్థలిని పరిశీలించి రూమ్ నంబర్ 103లో మహిళ మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం పంపామని చెప్పారు. తర్వాత విచారణలో మృతురాలు విశాఖ జిల్లా దేవరాపల్లి గ్రామానికి చెందిన ఆరిపాక ఈశ్వరమ్మగా గుర్తించామన్నారు. గత నెల 24న అరకు మండలం ఉరుముల గ్రామానికి చెందిన మాదాల శ్రీరాములు చందన్ లాడ్జిలో తమ విచారణలో రూమ్ బుక్ చేశాడని, ఆ వ్యక్తే హత్యకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. నిందితుడు మాదాల శ్రీరాములును మంగళవారం మధ్యాహ్నం 1గంట సమయంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అరెస్టు చేశామని చెప్పారు. ఈశ్వరమ్మను ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం హత్య చేసినట్లు నిందితుడు శ్రీరాములు విచారణలో అంగీకరించాడని చెప్పారు.

డబ్బుల కోసం గొడవపడి..

పోలీసుల విచారణలో నిందితుడు మాట్లాడుతూ


హత్య కేసు వివరాలు చెబుతున్న డీఎస్పీ గోవిందరావు


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు

మృతురాలు ఈశ్వరమ్మను తనకు తెలుసని, ఆమెను లాడ్జికి తానే తీసుకెళ్లానని, తర్వాత డబ్బుల కోసం గొడవ పడ్డామని చెప్పాడు. ఆ గొడవలో తాను ఆమెను గోడకు గుద్దేయడంతో తలకు గాయమై పడిపోగా తర్వాత మెడకు చీర బిగించి చంపినట్లు చెప్పాడు. మరుసటి రోజు లాడ్జికి వచ్చి మృతురాలి వంటిపై ఉన్న 4బంగారు గాజులు, దుద్దులు, ఉంగరం తీసుకుని, ముత్తూట్ ఫిన్ కార్పొరేషన్ బ్యాంక్‌లో తాకట్టు పెట్టినట్లు చెప్పాడు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో ముత్తూట్ బ్యాంక్ నుంచి 60గ్రాముల బంగారం, నిందితుడి నుంచి రెండు మొబైల్స్, పల్సర్ బైక్, లక్ష రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ గోవిందరావు వివరించారు. హత్య కేసును ఛేదించిన సీఐలు, ఎస్సై ఇతర సిబ్బందిని డీఎస్పీ గోవిందరావు అభినందించారు.

ఎంఈఓల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా మండల విద్యాశాఖాధికారుల సంఘం నూతన జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంఈఓల సంఘం జిల్లా నూతన కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా జె నారాయణ స్వామి, జిల్లా అధ్యక్షుడిగా సామల సింహాచలం, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్ నాగభూషణ రావు, ట్రెజరర్‌గా మువ్వల వెంకటరమణ, జిల్లా కార్యవర్గ సభ్యులుగా కర్రి ప్రసాదరావు, ఎం.శ్రీనివాసరావు, ఆర్.ఆనంద రావు, పి.జోగారావు, కె.సోంబాబు, పి.సత్యనారాయణ మహిళా ప్రతినిధులుగా వై.విమలకుమారి, సూరిదేముడు ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా బి.చంద్రశేఖర్, ఎ.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

భారీ అన్న సమారాధన

విజయనగరం టౌన్: ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రాణాలు త్యాగం చేసిన ఇమామ్ హుస్సేన్, హసాన్‌ల పేరు మీద పట్టణంలోని కోట్లమాదప్ప వీధిలో ఉన్న దరియాఖాన్ బాబా దర్గా ఆవరణలో మంగళవారం జియారత్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కులమతాలకతీతంగా భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు సిద్దిక్ మహమ్మద్ చిష్టి కమిటీ సభ్యులు షేక్ బహుదూర్, షేక్ నాజర్, షరీఫ్, రహీమ్, కాన్, రెహమ్‌తుల్లా, షరీఫ్ మహ్మద్, మున్నాన్, కసుర్ పాల్గొన్నారు

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

నెల్లిమర్ల రూరల్: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద సమస్యల పరిష్కరించాలని కార్మికులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు.

నిధులను సక్రమంగా రొటేషన్ చేసుకోవాలి : పీడీ

విజయనగరం అర్బన్: వివిధ రూపంలో అందుతున్న రుణాలను పొదుపు సంఘాలు సక్రమంగా రొటేషన్ చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి అన్నారు. డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు పేర్కొన్నారు. అన్ని మండల సమాఖ్యల్లో నిధులు వినియోగం సక్రమంగా నిర్వహించాలని అప్పుడే ఆర్థికంగా నిలదొక్కుకుంటాయని అన్నారు.

పైడిమాంబ దీక్షాపీఠం నూతన కార్యవర్గం

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీపైడితల్లి అమ్మవారు దీక్షలకు సంబంధించి శ్రీ పైడిమాంబ దీక్షాపీఠం నూతన కార్యవర్గం ఎంపిక, సర్వసభ్య సమావేశం మంగళవారం అమ్మవారి కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.ఎస్.పాత్రో మాట్లాడుతూ ఈ ఏడాది నిర్వహించే అమ్మవారి సిరిమాను జాతర మహోత్సవాల్లో భాగంగా దీక్షలు చేపట్టే భక్తులకు అన్ని ఏర్పాట్లు కల్పించే విధంగా నూతన కార్యవర్గం బాధ్యతలు చేపడుతుందన్నారు. వ్యవస్థాపక అధ్యక్షు డుగా ఆర్.సూర్యపాత్రో, ఉపాధ్యక్షులుగా బి. మహేష్, కె.మహేష్, ఎస్.మహేష్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.అచ్చిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా సిహెచ్. నాని, వి.రామ్‌కుమార్, శివశంకర్, కె.కనకరావులతో పాటూ ఎగ్జిక్యూటివ్ మెంబర్లును ఎంపిక చేశారు.

మానవహక్కుల కమిషన్ వర్కింగ్ చైర్మన్ నియామకం


మానవ హక్కుల కమిషన్ వర్కింగ్ చైర్మన్‌గా నియమితులైన మల్లేశ్వరరావు

విజయనగరం: రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ వర్కింగ్ చైర్మన్‌గా వి.మల్లేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను ఇంటర్నేషనల్ మానవ హక్కుల అసోసియేషన్ నుంచి అందుకున్నట్లు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతల మేరకు సమస్యలతో బాధపడుతున్న పౌరుల వేదనను అధికారులకు నివేదించి పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. పాఠశాల విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ఆడుదాం ఆంధ్రా లోగో రూపకల్పన

- క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వర రావు


క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎస్.వేంకటేశ్వర రావు

పార్వతీపురంటౌన్: ఆడుదాం ఆంధ్రా క్రీడల లోగో, మస్కట్‌లను రూపొందించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా క్రీడలు అక్టోబర్ 2వ తేదీన ప్రారంభమవుతాయని, ఈ క్రీడలు గ్రామ, వార్డు సచివాలయం, మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో 46 రోజుల పాటు జరుగుతాయని అన్నారు. ఆడుదాం ఆంధ్రాలో బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌లతో పాటు యోగా, మారథాన్, పేరొందిన స్థానిక క్రీడలకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఆడుదాం ఆంధ్రా క్రీడలకు లోగో, మస్కట్ రూపొందించే పోటీల్లో పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయం విద్యార్థులతో పాటు, ఆంధ్ర ప్రదేశ్ పౌరులు ఎవరైనా పాల్గొన వచ్చని సూచించారు. మంచి ఆలోచనా విధానంతో చక్కటి సృజనాత్మకత కలిగిన లోగో, మస్కట్‌లు రూపొందించిన వారికి మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలుగా ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు.

'లోగో మస్కట్ ఆన్‌లైన్ అప్‌లోడ్ ఇలా..

పోటీలు ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీ://స్పోర్ట్స్.ఏపీ.ఇన్ వెబ్ సైట్‌లో ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. 7వ తేదీ సాయంత్రం పోటీలపై తుది నిర్ణయం ప్రకటిస్తారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలు, ఆరోగ్యం, దృఢత్వం ప్రోత్సహించడం, శీర్షికన పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. లోగో డిజైన్‌తో పాటు తెలుగులో ట్యాగ్ లైన్, మస్కట్‌కు ప్రత్యేకంగా సమర్పించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు లోగో, మస్కట్‌లలో ఒకదానికి లేదా రెండు పోటీలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు క్రియేటివ్ కార్నర్ సెక్షన్ లేదా ఈ మెయిల్ ఐడీ ద్వారా ఎంట్రీలను సమర్పించవచ్చని చెప్పారు. ఎంట్రీల వివరాలను సంక్షిప్తంగా తెలియజేయాలని, విజేతగా నిలిచిన లోగో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ప్రభుత్వానికి చెందుతుందని పేర్కొన్నారు. లోగోలో ఎటువంటి అభ్యంతరకర సన్నివేశాలు, పదాలు ఉండరాదని స్పష్టం చేశారు. లోగో, మస్కట్‌ను సొంతంగా రూపొందించాలని, దేనికీ అనుకరణ ఉండరాదని, ఇండియన్ కాపీ రైట్ చట్టం, 1957కు లోబడి ఉండాలని వివరించారు. లోగో కలర్‌లో డిజైన్ చేయాలని, డిజిటల్ విధానంలో రూపొందించాలని, హై రిజల్యూషన్ (కనీసం 300 డీపీఐ)లో ఉండాలని, జేపీఈజీ లేదా పీఎన్‌జీ, లేదా పీడీఎఫ్ ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయాలని, వెబ్ సైట్, సామాజిక మాధ్యమాలు, పేపర్లపై ముద్రణకు అనుగుణంగా ఉండాలని ఆయన వివరించారు. సృజనాత్మకత, వాస్తవికత (ఒరిజినాలిటీ), కూర్పు, సాంకేతిక ప్రతిభ, కళాత్మకత, కనిపించే విధానం తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక కమిటీదే తుది నిర్ణయమని స్పష్టం చేశారు.

ఆర్టీసీలో యూటీఎస్‌పై అవగాహన


యూటీఎస్ విధానం ద్వారా ప్రయాణికులకు టికెట్లు అందజేస్తున్న కండక్టర్

విజయనగరం టౌన్: కాలానికనుగుణంగా ఏపీఎస్‌ఆర్టీసీ నగదు రహిత లావాదేవీలపై దృష్టిసారించింది. కరోనా నేపథ్యంలో నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు యూనిఫైడ్ టికెటింగ్ సిస్టమ్ (యుటీఎస్) విధానాన్ని 2022లో ప్రవేశపెట్టింది. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వారి మొబైల్స్‌నుంచే నేరుగా టికెట్‌లు అందించేందుకు ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్‌లకు మంగళవారం అవగాహన నిర్వహించింది. జిల్లా ప్రజారవాణాధికారి అప్పలనారాయణ, డిపో మేనేజరు శ్రీనివాసరావు,అసిస్టెంట్ మేనేజరు ఆదినారాయణ, రీజనల్ కోర్ గ్రూప్ సూర్యప్రకాష్‌లు డిపోలో ఉన్న అన్ని బస్సుల్లో విధులు నిర్వహిస్తున్న కండక్టర్లు, డ్రైవర్లకు యూటీఎస్ మెషీన్‌పై అవగాహన కల్పించారు. ప్రయాణికులకు ఈ టికెట్ అందించేలా చర్యలు చేపట్టారు.

విస్తృతంగా అవగాహన

ఆర్టీసీలో నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నాం. డ్రైవర్లు, కండక్టర్లకు ప్రతిరోజూ యూటీఎస్ విధానం ద్వారా ప్రయాణికులకు టికెట్లు ఇచ్చేవిధంగా తెలియజేస్తున్నాం. అన్ని రకాల యాప్‌ల ద్వారా టికెట్‌లు వచ్చేలా మెషీన్ రూపకల్పన చేశాం. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సీహెచ్. అప్పలనారాయణ, జిల్లా ప్రజారవాణాధికారి, విజయనగరం

బంగారం చోరీ

గజపతినగరం: మండల కేంద్రంలో పాతమండల పరిషత్ కార్యాలయం రోడ్‌లో నివాసం ఉంటున్న ఇమంది రమణమ్మ ఇంట్లో మంగళవారం వేకువజామున బంగారం చోరీ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త చనిపోయాడని, ఇద్దరు కుమారులు ఆర్మీలో పని చేస్తున్నారని ఒక్కదాన్నే ఉండడం చూసి దొంగతనానికి దుండగులు పాల్పడినట్లు కన్నీటి పర్యంతమైంది. సోమవారం రాత్రి ఒంటరిగా ఉన్నందున పక్కనే తెలిసిన వారి ఇంట్లో నిద్రించేందుకు వెళ్లానని మంగళవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి బీరువా తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారని వాపోయింది. తులం బంగారం చోరీ జరగడంతో పోలీసులకు ఫిర్యాదు చేశానని ఆమె తెలిపింది.

అర్హులందరికీ ఆసరా అందేలా చూడాలి

- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ అప్పలరాజు


సమావేశంలో మాట్లాడుతున్న ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ అప్పలరాజు

విజయనగరం ఫోర్ట్: అర్హులైన వారందరికీ ఆరోగ్య ఆసరా అందేలా చూడాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక తిరుమల మెడికల్ ఆస్పత్రిలో ఆరోగ్య మిత్రలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు టిఫాస్కాన్, అల్ట్రాసౌండ్ స్కాన్ చేయాలని సూచించారు. నిర్దేశిత సమయానికి ఎఫ్‌ఆర్‌ఎస్ అందరూ వేయాలని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స పొందే రోగులకు అన్ని సేవలు ఉచితంగా అందించాలని కోరారు. ఎవరైనా చేతివాటం ప్రదర్శిస్తే తీవ్రమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్య ఆసరా కేసులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఆరోగ్యశ్రీ రోగులకు అందించే భోజనం నాణ్యంగా ఉండేలా చూడాలన్నారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో టీమ్ లీడర్లు రాయవరపు ముత్యాలనాయుడు, ఎ. భానుప్రసాద్, బి.ఉమ, పి.దేవి పాల్గొన్నారు.

ఘనంగా ఆదిత్య ఎచీవర్స్ డే 2003 వేడుకలు



రూ.13 లక్షల ప్యాకేజీ సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, ఎస్పీ దీపిక

విజయనగరం అర్బన్: సాధారణ డిగ్రీ పూర్తి చేసి రూ.లక్షల ప్యాకేజీ సాధించడంలో విద్యార్థి ప్రతిభ, క్రమశిక్షణతో కూడిన కళాశాల బోధన సహకరిస్తాయని ఆ దిశగా ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యాసేలను అందిస్తోందని మాజీ డాక్టర్ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి కొనియాడారు. పట్టణానికి చెందిన ఆదిత్య డిగ్రీ కళాశాల స్థానిక ప్రదీప్‌నగర్‌లో ఒక ప్రైవేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన 'ఎచీవర్స్ డే -2023' కార్యక్రమానికి ఆమె విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యతోపాటు విద్యార్థుల్లోని స్కిల్స్ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ దీపిక మాట్లాడుతూ విజయనగరానికి చెందిన ఆదిత్య కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి అధిక సంఖ్యలో ఉద్యోగాలు సాధించడం ప్రసంశనీయమన్నారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి మాట్లాడుతూ ఆదిత్య విద్యాసంస్థలో చదివిన ప్రతి విద్యార్థికీ డిగ్రీ పూర్తయి వెళ్లేముందు ఒక చేతిలో డిగ్రీ పట్టా మరో చేతిలో ఎంఎన్‌సీ కంపెనీలో ఉద్యోగం అందజేస్తున్నామని చెప్పారు. అనంతరం గడిచిన సంవత్సరంలో ఉద్యోగాలు సాధించిన 483 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఎస్పీ దీపికను విద్యాసంస్థ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ పీవీవీగోపాల రాజు, కళాశాల పిన్సిపాల్ బి.దామోదరరావు, విజయనగరం డైరెక్టర్ పి.రామకృష్ణారెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.